క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

హెచ్‌డీఎఫ్‌సీ శాఖ ప్రారంభం



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న ప్రసాద్‌నాయక్ తదితరులు

సబ్బవరం: సబ్బవరంలో ఏర్పాటు చేసిన హెచ్‌డీఎఫ్‌సీ నూతన శాఖను శుక్రవారం మెరైన్ ప్రొడక్ట్స్ అండ్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్. ప్రసాద్ నాయక్ ప్రారంభించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఖాతాదారులకు కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సర్కిల్ హెడ్ విశ్వనాథ్, క్లస్టర్ హెడ్ రాజేష్ నమ్మి, బ్రాంచి మేనేజరు వాసుదేవరావుతో పాటు మిగిలిన సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ పోటీల్లో లింగేశ్వరరావు ప్రతిభ



డబుల్స్‌లో బంగారు పతకం అందుకుంటున్న లింగేశ్వరరావు జోడీ

ఉక్కునగరం: జాతీయ మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బి.వి.ఎస్.కె. లింగేశ్వరరావు సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో బంగారు పతకం సాధించారు. మార్చి 19 నుంచి 30 వరకు గోవాలో జరిగిన సన్‌రైజ్ యోనెక్స్ ఇండియన్ మాస్టర్స్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో దేశవ్యాప్తంగా వందలాది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సింగిల్స్‌లో బంగారు పతకం సాధించగా, 55+ కేటగిరీలో ఎ.వి.రాజుతో డబుల్స్‌లో పాల్గొని బంగారు పతకం గెలుపొందారు. ఈ పోటీల్లో గెలవడం ద్వారా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు కొరియాలో జరగనున్న వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.

ప్రభుత్వ పాఠశాలలకు 'నాట్స్' చేయూత

అక్కిరెడ్డిపాలెం: 'భాషే రమ్యం..సేవే గమ్యం' నినాదంతో జన్మభూమికి సేవ చేయాలనే తలంపుతో ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు సహకారం అందిస్తున్నామని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) కన్వీనర్ అప్పసాని శ్రీధర్ అన్నారు. 69వ వార్డు నాతయ్యపాలెంలోని ప్రాథమిక పాఠశాలను నాట్స్, గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) ప్రతినిధులు శుక్రవారం సంయుక్తంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడానికి ప్రవాస భారతీయులందరూ కలిసి నాట్స్ సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులకు డిజిటల్ తరగతులు బోధించడానికి అవసరమైన సుమారు రూ.60 వేలు విలువ చేసే ప్రొజెక్టర్, స్క్రీన్, స్టాండ్‌లను నాట్స్ ద్వారా అందిస్తామన్నారు. విద్యార్థులకు పండ్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో గ్లో కార్యదర్శి వై.వెంకన్న చౌదరి, నాట్స్ ఇండియా కో- ఆర్డినేటర్ ఎస్.రామా నాయుడు, పాఠశాల హెచ్‌ఎం జి.భాను తదితరులు పాల్గొన్నారు.

జానపద సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

నాట్స్, గ్లో, మాత కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో శనివారం తెలుగు జానపద సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీధర్ తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శ్రీ మాతా కళాపీఠం నిర్వాహకులు పాల్గొన్నారు.

భవితకు పునాది 'పది'

- ఆర్జేడీ జ్యోతికుమారి
- అడవివరం జెడ్పీ హైస్కూల్ సందర్శన



వాడచీపురుపల్లి విద్యార్థులకు సూచనలిస్తున్న అధికారులు



ట్యాబ్‌లను పరిశీలిస్తున్న జ్యోతి కుమారి

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు ఆర్జేడీ జ్యోతికుమారి సూచించారు. అడవిరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. పాఠశాలకు సంబంధించిన అకడమిక్, నాన్ అకడమిక్ అంశాలపై నిర్వహిస్తున్న రికార్డులు పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులంతా శ్రద్ధగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులతో పాటు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని బాధ్యత కలిగిన పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 8వతరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయులు నోట్ బుక్స్ కరెక్షన్స్, సిలబస్ పూర్తి చేశారా...లేదా...అన్న విషయలపై ఆరా తీశారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయుడు మల్లికార్జునరావు పదోతరగతి పిల్లలకు సమకూర్చిన అట్టలు, పౌచ్‌లు, పెన్నులు, పెన్సిళ్లను ఆమె అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పరవాడ: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీవో వి.హేమసుందరావు సూచించారు. ఈ నెల 3 నుంచి జరగనున్న టెన్త్ క్లాస్ పరీక్షల నిర్వహణ కోసం వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. పరీక్ష రాసేటప్పుడు ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ఒత్తిడికి లోను కాకుండా ముందు వచ్చిన సమాధానాలు రాయాలన్నారు. జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

పరిహారం కోసం ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన



మృతుడు వెంకటేష్ (ఫైల్)

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కార్మికుడు శుక్రవారం ఉదయం గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు అందించిన వివరాలు.. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలేనికి చెందిన ఉమ్మిడి వెంకటేష్ (32) యుజియా స్టెరైల్స్ పరిశ్రమలో పని చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం పరిశ్రమ వద్దకు వచ్చాడు. ఇంతలో ఆరోగ్యం బాగా లేదని క్యాంటీన్‌లో కాసేపు కూర్చుని ఉండగా తోటి కార్మికులు వెంకటేష్‌కు సపర్యలు చేశారు. అనంతరం విధులకు వెళుతుండగా ఉన్నట్టుండి కుప్పకూలిపోయాడు. వెంటనే అంబులెన్స్‌లో వన్‌ప్లస్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం మరో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో వెంకటేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, 4, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. వెంకటేష్ మృతదేహాన్ని షీలానగర్ కిమ్స్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.



షీలానగర్ కిమ్స్ ఐకాన్ వద్ద రోదిస్తున్న మృతుని భార్య, బంధువులు

రూ.కోటి చెల్లించాలి.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడు వెంకటేష్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు.

మృతుడి బంధువుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, గ్రామస్తులు హాస్పిటల్ ఆవరణలో ఆందోళన చేపట్టారు. నష్టపరిహారంతో పాటు మృతుని భార్యకు కంపెనీలో ఉద్యోగం కల్పించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్దకు కంపెనీ ప్రతినిధులు చేరుకొని కుటుంబ సభ్యులతో రాత్రి వరకు చర్చలు జరుపుతున్నారు. ఎటువంటి ఆందోళనకర సంఘటనలు జరగకుండా గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్, పరవాడ ఎస్ఐ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టారు.

160 కేజీల గంజాయి పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: నిషేధిత గంజాయిని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ డీ బ్లాక్‌లోని సెఫ్ ఎక్స్‌ప్రెస్ పార్సిల్ గొడౌన్‌కు ఇసుకతోటకు చెందిన ఒక ఆటో డ్రైవర్ తన ఆటోలో పార్సిల్ చేసిన 160 కేజీల గంజాయిని తీసుకువచ్చారు. గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో గాజువాక పోలీసులు గొడౌన్ వద్దకు చేరుకుని ఆటోను స్వాధీనం చేసుకుని, ఆటోడ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి రవాణాపై ఆటో డ్రైవర్ నుంచి వివరాలు సేకరించగా కరాసలో ఒక వ్యక్తి ఆటోనగర్ పార్సిల్ సర్వీసుకు బేరం మాట్లాడాడని తెలిపాడన్నారు. దీంతో గంజాయిని తీసుకువచ్చిన అసలు వ్యక్తి పరారీలో ఉండగా, ఆటోడ్రైవర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా స్వామి, కృష్ణ



కె.వి.స్వామి, కృష్ణ

గాజువాక : గాజువాక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగాయి. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా కె.వెంకటస్వామి, బీవీఎం కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎం.రామ సుధాకర్, సంయుక్త కార్యదర్శిగా ఎ.సీతా మహాలక్ష్మి, కోశాధికారిగా పల్లా శ్రీనివాసరావు, మహిళా ప్రతినిధిగా ఎస్.ఆదిలక్ష్మి, గ్రంథాలయ కార్యదర్శిగా ఎంజీ డబ్ల్యూ డేవిడ్‌రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గిల్‌బెర్ట్ ఈదా, లంక సత్యనారాయణ, జంగాల శ్రీరామ్, జామి శ్యామలరావు, బాయన తులసీ వెంకట ప్రసాద్ ఎన్నికైనట్టు ఎన్నికల నిర్వహణాధికారులు వి.శ్రీనివాసరావు, ఎం.పార్వతీశం తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సింహాచలం: భావి భారతం ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.వెంకటలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాంపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంతో లభించే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ పిల్లల తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా పోషకాలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మునగ ఆకు భోజనంలో వినియోగించాలని, వైఎస్సార్ కిట్స్ సక్రమంగా వినియోగించడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉంటారన్నారు. కార్యక్రమంలో రాంపురం ఎంపీటీసీ గండి హిమబిందు, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, భాగ్య, నాగమణి, సమత తదితరులు పాల్గొన్నారు.

రూ.2.15 కోట్ల పన్ను చెల్లించిన ఐలా

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీకి ఆటోనగర్‌లోని ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) శుక్రవారం రూ.2.15 కోట్లు పన్ను చెల్లించింది. జీవీఎంసీలోని వివిధ విభాగాలకు ఐలా కమిషనర్ కె.సూర్యనారాయణ ఈ పన్ను చెల్లించినట్లు ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ తెలిపారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో..

- 2న దుర్గాపురం గ్రామ కమిటీ ఎన్నికలు
- ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కమిటీ
- చిన్న గ్రామంలో ఫరిడవిల్లుతున్న ప్రజాస్వామ్యం



దుర్గాపురం ముఖ ద్వారం

గోపాలపట్నం: అది మహానగరంలోని ఓ చిన్న గ్రామం.. ఆ గ్రామంలో ప్రజాస్వామ్యం ఫరిడవిల్లుతోంది. అదే జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురం. ప్రజాస్వామ్య స్ఫూర్తితో గ్రామ అధ్యక్షుడి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలే ఇక్కడ కూడా వర్తింప చేస్తున్నారు. సాధారణ ఎన్నికలను తలపించే విధంగా ప్రక్రియ ఉంటుంది. బరిలో నిలిచిన అభ్యర్థులు ముందే మేనిఫెస్టో ప్రకటించారు. నామినేషన్ల ప్రక్రియతో పాటు శుక్రవారం సాయంత్రంతో ప్రచార గడువు ముగిసింది. ఈ నెల 2వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. మొత్తం 680 మంది ఓటర్లు ఉన్నారు.

ప్రక్రియ ఇలా..

ఎన్నికల ప్రక్రియ ఏ విధంగా చేపట్టాలని గ్రామంలో పెద్దలు నిర్ణయిస్తారు. గ్రామ సభ నిర్వహించి ఎన్నికల కమిటీని ఎన్నుకున్నారు. ఆకమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ మొత్తం కొనసాగుతుంది.

ఇవీ నిబంధనలు

- 18 ఏళ్లు నిండినవారే ఓటింగ్‌లో పాల్గొనాలి.
- కనీసం గ్రామంలో 15 నుంచి 20 ఏళ్లుగా నివసిస్తున్న వారై ఉండాలి. - గ్రామంలో నివాసీయులై సొంత ఇల్లు ఉండి ఉద్యోగ రీత్యా, మరే ఇతర కారణాలతో బయట ఉన్నవారు సైతం ఓటింగ్‌కు అర్హులవుతారు. ఓటింగ్ వేసేందుకు ఓటర్ ఐడీ లేదా ఆధార్ కార్డు ఉండాలి.

ముగిసిన ప్రచారం

మార్చి 28,29 తేదీల్లో నామినేషన్లు దాఖలు చేశారు. 30వ తేదీ విత్ డ్రాల్ పూర్తయింది. 31తో ప్రచారం ముగిసింది. ఏప్రిల్ 2న (ఆదివారం) ఉదయం నుంచి ఓటింగ్ మొదలవుతుంది. అదే రోజు లెక్కింపు, విజేతను ప్రకటిస్తారు. ఈ ఎన్నికల్లో గెలిచిన గ్రామ కమిటీ అధ్యక్షుడి పదవీ కాలం 3 ఏళ్లు ఉంటుంది. మిగిలిన కమిటీ సభ్యులను అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఎన్నుకుంటారు.

ధరావత్తు చెల్లించాల్సిందే..

నామినేషన్ వేయాలంటే రూ.10 వేలు ఎన్నికల నిర్వహణ కమిటీకి కట్టాలి. అందులో సగం ఆలయ అభివృద్ధికి , మిగిలిన నగదుతో ఎన్నికలు నిర్వహిస్తారు.

గ్రామంలో దీర్ఘ కాలిక సమస్యలు...

దుర్గాపురంలో దీర్ఘ కాలిక సమస్యలు ఉన్నాయి. ఈ గ్రామం పోర్టు స్థలంలో నిర్మాణమై ఉంది. ఆ స్థలాన్ని నేవీకి పోర్టు లీజుకు ఇచ్చేంది. ఇదే ఇక్కడి ప్రధాన సమస్య. వీరికి ఇళ్ల పట్టాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రధాన సమస్య రహదారి...ఈ గ్రామానికి వెళ్లాలంటే సాకేతపురం మీదుగా నేవెల్ ఆర్మమెంట్ డిపో(ఎన్ఏడీ)కు వెళ్లే రహదారిలో వెళ్లాలి. అయితే రాత్రి సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మరో మార్గం కరాసా మీదుగా రైల్వే ట్రాక్స్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామం చుట్టూ పోర్టు, నేవీ, రైల్వే అధికారులు గోడలు నిర్మించేశారు. దీంతో ఈ గ్రామానికి రహదారి లేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. గ్రామ కమిటీ అధ్యక్ష బరిలో ఉన్న వారు ఈ రెండు ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు వారి వారి ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నారు.

నూరుశాతం ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్, ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ ఆకాంక్షించారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న పాఠశాల విద్యార్థులకు హాల్ టికెట్లతో పాటు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు కిట్లు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దినేష్‌రాజ్ మాట్లాడుతూ గతేడాది నూరుశాతం ఉత్తీర్ణత లభించిందని, ఈఏడాది కూడా విద్యార్థులు బాగా పరీక్షలు రాసి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల నుంచి గతేడాది 51మంది పరీక్షలకు హాజరు కాగా 36మంది ప్రథమశ్రేణిలో పాస్ అయ్యారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన అధ్యాపకురాలు పి.భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఎంఈవో ఎస్ అప్పలరాజు

సబ్బవరం: ఈ నెల 3 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. సబ్బవరం మండలంలో ఏర్పాటు చేసిన 5 పరీక్షా కేంద్రాల్లో 1,040 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. వీటిలో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది,ప్రతిభా విద్యాలయంలో 240 మంది ,సన్‌రిడ్జ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 160 మంది,మదర్ పబ్లిక్ స్కూల్‌లో 240 మంది ,రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. మొదటి 3 రోజులకు ఇప్పటికే 45 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్టు తెలిపారు. పరీక్షలను పర్యవేక్షించేందుకు 5గురు చీఫ్‌లతో పాటు 5గురు డీవోలను నియమించారన్నారు.ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఎంఈవో అప్పలరాజు సూచించారు.

ఘనంగా పౌరహక్కుల దినోత్సవం



పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

పరవాడ: అణగారిన వర్గాలకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడానికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో హేమసుందర్రావు సూచించారు. నాయుడుపాలెం గ్రామంలో పౌరహక్కుల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సంక్షేమ పథకాల పంపిణీలో వివక్షకు తావు లేదన్నారు. ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న పథకాలపై అణగారిన వర్గాల నుంచి ఆరా తీశారు. తమకు అన్ని ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహశీల్దారు ప్రకాశరావు, ఎంఈవో ఎం.సునీత, ఈవోఆర్డీ పద్మజ, వాడచీపురుపల్లి పాఠశాల ఉపాధ్యాయులు, నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ



ఎన్టీపీసీ వద్ద కార్మికులతో కలిసి చలో ఢిల్లీ కరపత్రం ఆవిష్కరిస్తున్న గనిశెట్టి

పరవాడ: కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈ నెల 5న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సింహాద్రి ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద చలో ఢిల్లీ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ ఎన్టీపీసీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాదిగా రైతు, కార్మికులు, రైతు కూలీలు తరలివచ్చి విజయవంతం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం



దీక్షలో పాల్గొన్నమహిళా సంఘం నాయకులు

సీతమ్మధార : ప్రజలకు అన్ని విధాలా సేవలందించి ఆదుకుంటున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం కాకుండా రక్షించుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరసన దీక్షలు 729వ రోజుకు చేరుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలు తమ వంతు పాత్ర పోషించి ప్రజలకు భరోసాగా నిలిచాయన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా జరిగిందన్నారు. వేలాది ఎకరాల భూమి త్యాగం చేసి స్థానికులు నిర్వాసితులయ్యారని తెలిపారు. కార్పొరేటీకరణ విధానాలు అమలు చేసిన ఏ దేశం అభివృద్ధి సాధించలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.మణి, ఆర్.వరలక్ష్మి, ఎ.పుష్ప, విమల పాల్గొన్నారు.

778వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తూ, దేశ ఆర్థిక ప్రగతికి పునాదులు వేస్తున్న కార్మికుల సంక్షేమాన్ని మరచిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 778వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఈ అండ్ ఎస్ఎఫ్, ఈఎండీ, ఈఆర్ఎస్, సేఫ్టీ, టికెసెల్, ఎస్ఎస్‌డీ, ఆగ్రో విభాగాల కార్మికులు కూర్చుని, సంఘీభావం తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు దీక్షను విరమించేది లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే కార్మికుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. కార్మిక చట్టాలను కాపాడుకోవాలంటే ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.